


# బిస్మిల్లా యిర్రహమా నిర్రహీమ్

బాగా శాస్త్రాలు చదువుకున్న, అల్లా గొప్పతనం తెలిసిన, ఖురాన్ కంఠోపాఠం వచ్చిన ఒక ముల్లాగారు ఒకసారి ఒక ఊరి నుంచి మరో ఊరికి పోతున్నారు.

మధ్యలో వాగు అడ్డం వచ్చింది. అది పోటులో వుంది.

వెంటనే ముల్లాగారు తన చేతిలో వున్న పెద్ద పెద్ద పుస్తకాలు, గ్రంథాలు అన్నీ కిందపెట్టి ఒడ్డున కూర్చున్నారు.

ఆ తర్వాత లెక్కలు మొదలుపెట్టారు.

'ఇప్పుడు టైము యింతయ్యింది. ఈ టైములో ఈ వాగు యింత పోటులో వుంది. యింత పోటులో వుందీ అంటే యిందులో యింత ఎత్తుకు నీళ్లు ప్రవహిస్తూ వుండొచ్చు. యింత ఎత్తుకు నీళ్లు ప్రవహిస్తూ వున్నాయంటే ఈ వరవడి తగ్గడానికి యింత టైము పడుతుంది. యింత టైము పట్టాక వాగులోని నీళ్లు యింత మట్టానికి కిందకు దిగుతాయి. యింత మట్టానికి దిగాక నేను అడుగు పెడితే అవి ఖచ్చితంగా నా మోకాళ్ళదాకా వస్తాయి. అంతదాకా ఆగాలంటే యింకా నేను రెండు గంటల ముప్పయి రెండు నిమిషాలు యిక్కడే వేచి వుండక తప్పదు' అనుకొని ఈలోపున టైము ఎందుకు వృధా చేయాలి అని, ఏదో పుస్తకం తీసి చదువుతూ కూర్చున్నారు.

ఈలోపు ఒక పల్లెటూరి వాడు కట్టెల మోపును ఎత్తుకొని అక్కడకు వచ్చాడు.

వాడు ఒడ్డు దగ్గర ఆగి దాటబోతుంటే ముల్లాగారు వాణ్ణి ఆపారు.

'ఓయ్. పిచ్చివాడా. యిప్పుడు వాగు మంచి పోటులో వుంది. దీనిలో యిప్పుడు యిన్ని అడుగుల నీరు పారుతూ వుంది. యిది తగ్గాలంటే యిన్ని గంటల యిన్ని నిముషాలు పడుతుంది. అవన్నీ నీకు తెలియవుగానీ ఆగు. లేకుంటే ప్రాణాలు పోగొట్టుకుంటావు' అన్నారు వాడితో.

'అదేంది స్వామీ కొత్తగా చెబుతారు. నేను రోజుకు రెండుసార్లు ఈ వాగు దాటుతాను. ఈ పోటు ఏమిటో ఆ పాటు ఏమిటో నాకు తెలియదు సాహెబ్' అన్నాడు పల్లెటూరి వాడు.

'అవునా? మరి రోజూ ఎట్లా దాటుతున్నావయ్యా?' అని ఆశ్చర్యపోయాడు ముల్లాగారు.

యిదిగో యిట్లా అని, పెద్దగా 'బిస్మిల్లా యిర్రహమా నిర్రహీమ్' అని జపించి, చకచకా అవతలకి వెళ్లిపోయాడు.



ముల్లాగారి ఆశ్చర్యానికి అవధులు లేవు.

'ఓయ్ పల్లెటూరి వాడా. నీకు నాకంటే ఎక్కువ శాస్త్రాలు తెలిసినట్టున్నాయే' అన్నాడు పెద్దగా.

'కాదండీ. నాకేమీ తెలియదండీ. నాకు కల్మాలుగానీ, నమాజుగానీ, ఖురానుగానీ ఏమీ తెలియవండీ. నాకు తెలిసిందల్లా బిస్మిల్లా యిర్రహమా నిర్రహీమ్ ఒక్కటేనండీ. నిజానికి దీని అర్థం కూడా నాకు తెలియదండీ. తమరే మళ్లెప్పుడైనా చెప్పాలి' అనేసి వెళ్లిపోయాడు వాడు.

శాస్త్రాలు తెలిసిన ముల్లాగారు ఏం చేయాలో తోచక అట్లాగే గట్టున కూలబడ్డారు.